క్లుప్తంగా

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం పంచాయతీ బండమీద హరిజనవాడలో 167 మీటర్ల మేర, రూ.6 లక్షలు, ఆరిపి రెడ్డి గారి పల్లెలో 270 మీటర్ల మేర, రూ. 10 లక్షల నిధులతోనూ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పల్లె పండుగలో భాగంగా ఫిబ్రవరి చివరి వారంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. అయితే నిబంధనల మేరకు కాంక్రీట్ మిక్సర్ లేకపోవడంతో బండమీద హరిజనవాడలో సిమెంట్ రోడ్డు దెబ్బతిని చీలికలు ఏర్పడ్డాయి. నిర్మాణం పూర్తి చేసిన తర్వాత క్యూరింగ్ చేయకపోవడంతో సీసీ రోడ్లు నెలరోజులకే దెబ్బతిన్నాయి.

జాబ్‌మేళాలో 29 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

పీలేరు రూరల్ : స్థానిక సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం చెన్నైకి చెందిన ఏఆర్‌కేహెచ్‌ఆర్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 48 మంది పాల్గొనగా 29 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు మేనేజర్ కుసుమ, సురేష్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ భూములు పరిరక్షించాలి



మాట్లాడుతున్న ధరణికుమార్

పీలేరు రూరల్ : మండలంలో ఎస్సీ, ఎస్టీ భూములను పరిరక్షించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధరణికుమార్ అన్నారు. గురువారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల భూములను అగ్రవర్ణాలు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధితులు రెవెన్యూ అధికారులకు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ప్రసాద్, వెంకటేష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ అభివృద్ధికి సహకరించండి

మదనపల్లె : మదనపల్లె ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తిని కోరారు. గురువారం ఆయనతో కలిసి మండలంలోని పుంగనూరురోడ్డులోని ఆటోనగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్ అభివృద్ధి చెందితే తమకు మేలు జరుగుతుందన్న ఆశతో రైతులు 15 సంవత్సరాల క్రితం భూమలు ఇచ్చారన్నారు. కోర్టు కేసుల కారణంగా ఆటోనగర్ అభివృద్ధి చేయలేక పోతున్నామన్నారు.త్వరలోనే ఆటోనగర్ భూములకు సంబంధించి కోర్టు సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు

కురబలకోట : వేసవిలో మండుతున్న ఎండల దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురి కాకుండా వారికి మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు గురువారం అందజేశారు. వైద్యశాఖ సహకారంతో ఎంపీడీఓ గంగయ్య వీటిని పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన రూ.307 కనీస వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె: తేనెటీగల దాడిలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. ఈశ్వరమ్మ కాలనీ సమీపంలోని రాజారెడ్డి కాలనీకి చెందిన చలపతిరావు (89) పొలానికి వెళ్లాడు. అక్కడ పేరుకు పోయిన చెత్తకు నిప్పు పెట్టాడు. మంటలో నుంచి ఎగసిన పొగకు చెట్టుపై ఉన్న తేనెటీగల గుంపు చెదిరి అతనిపై దాడి చేశాయి. తేనెటీగల దాడిలో చలపతిరావు తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతి వడ్డిపల్లిలో ఈ నెల 5,6 తేదీలలో శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తుల ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త ఆదిమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఇదే గ్రామానికి చెందిన గజ్జెల తిరుపతమ్మ, క్రిష్టప్ప దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గజ్జెల శ్రీనివాసులు, కోడలు మాధవి ఆధ్వర్యంలో ప్రతిష్టా కార్యక్రమంతో పాటు పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి విజయవంతం చేయాలని గ్రామస్థులు, నిర్వాహకులు కోరారు.

అడవికి నిప్పు.. ఏది కనువిప్పు

అడవులపై అవగాహన కొరవడుతోంది. ఫలితంగా అగ్నికి ఆహుతవుతున్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం ఉండడం లేదు. కొందరు భూమి కోసం భుక్తి కోసం అంటూ అడవులను ఎదగనీయడం లేదు. అగ్గిపెట్టి అది రాజుకుని దావా దవానంలా వ్యాపించి అడవులు కాలిపోవడం నిత్యకృత్యమవుతోంది. అడవుల్లో జీవించే జీవకోటికి ముప్పు వాటిల్లుతోంది. అడవులకు నిప్పు పెట్టడం వలన పర్యావరణం దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కనుమరుగవుతున్న పచ్చదనం
- వన్యప్రాణుల మనుగడకు ముప్పు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు



కురబలకోట అటవీ ప్రాంతంలో కాలుతున్న అడవి

మదనపల్లె సిటీ : నిన్నా మొన్నటి వరకూ పర్యావరణ ప్రియులకు ఎంతో ఆకట్టుకున్న అటవీ ప్రాంతంలోని పచ్చదనం నేడు కనుమరుగైంది. పర్యావరణ విధ్వేషకుల చేతిలో నిలువునా కాలిపోయింది. ఏటా ఇది ప్రహసనంగా మారుతున్న ముందస్తు చర్యలు చేపట్టంలో అటవీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దగ్ధమవుతున్న అడవులు

మదనపల్లె అటవీశాఖ పరిధిలో 45 వేల హెక్టార్లలో అడవులు ఉన్నాయి. కొండ గుట్టలు, మైదాన ప్రాంతాలలో పచ్చని చెట్లు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుండేవి. జూన్‌లో కురిసిన వర్షాలకు నిండుకున్న పచ్చదనం ఫిబ్రవరి మొదటి వారం వరకూ నేత్రానందంగా కలిగిస్తుంటుంది. ఆ తర్వాత వేసవి నేపథ్యంలో భూమిపై పరుచుకున్న గడ్డి ఎండిపోతోంది. ఇటీవల మదనపల్లె సమీపంలోని కోళ్లబైలు, మాదినకొండ, బసినికొండ, కురబలకోట ఫ్లైఓవర్ వద్దనున్న అటవీ ప్రాంతం, తంబళ్లపల్లె మల్లయ్యకొండ అటవీ ప్రాంతంలో కొందరు నిప్పు పెట్టడంతో చాలా వరకు అటవీ ప్రాంతంలో చెట్లు కాలిపోయాయి. కొందరు స్వార్థపరులు నిప్పు రాజేయడంతో మంటలు చుట్టుముట్టి అటవీ ప్రాంతం బుగ్గవుతోంది. పచ్చని చెట్లతో పాటు వన్యప్రాణులు సజీవ దహనమైపోతున్నాయి.

కనిపించని ముందస్తు చర్యలు

గతంలో అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీశాఖ అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకునేవారు. ఇందులో భాగంగా అటవీ ప్రాంతంలో ట్రెంచ్‌లు, ఫైర్ బ్రేక్‌లు ఏర్పాటు చేసేవారు. అలాగే ఎక్కడికక్కడ వాచర్లను నియమించి అటవీ ప్రాంతం సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఈ చర్యలు కనిపించడం లేదు. కొందరు అకతాయిల చేష్టలకు విలువైన అటవీ సంపద దహించుకుపోతోంది. అటవీ ప్రాంతంలో నిప్పు రాజేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో వైఫల్యం కొట్టిచ్చినట్లు కనిపిస్తోంది. గతంలో ఫిబ్రవరి ఆరంభం నుంచే గ్రామాల్లో సదస్సులు నిర్వహించేవారు. కళాజాతాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేవారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీ సంరక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పర్యావరణ మనుగడకు ప్రమాదం



అడవులు, కొండ, గుట్టలకు నిప్పు పెట్టడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. వేసవి వస్తే చాలు నిప్పుపెట్టడాన్ని ఓ సంప్రదాయం మార్చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. దీంతో అడవులు అంతరించి జంతువులు జనావాసాల్లోకి చొరబడే ప్రమాదం ఉంది. అందుకే అడవులను సంరక్షించుకోవాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి.

– వి.ఎస్.రెడ్డి, పర్యావరణవేత్త, మదనపల్లె

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం

కలకడ : మండలంలోని గుడిబండ గ్రామంలో వెలసిన గ్రామదేవత చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం బుధవారం రాత్రి అశేష భక్త జనసందోహం మధ్య వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాన్ని సింహవాహనంపై ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. తొగటవీర క్షత్రియులు చౌడమాంబను కీర్తిస్తూ జానపదాలతో హోరెత్తించారు. జ్యోతులను తలపై పెట్టుకుని చేసే నాట్యం చూడటానికి భక్తులు ఎగబడ్డారు. అమ్మవారికి తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో గ్రామస్తుల, భక్తుల సహకారంతో ఘనంగా ఏటాబోనం సమర్పించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో మొదట జ్యోతులు, అనంతరం భక్తులు ప్రవేశం చేశారు. అమ్మ వారికి భక్తులు కానుకలు సమర్పించి తడిబట్టలతో అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు రథంలోని అమ్మవారి పాదాల కింద ప్రవేశించడానికి పోటీ పడ్డారు. గురు వారం ఉదయం 10గంటల వరకూ ఇంటింట పూజలు అందుకున్న చౌడేశ్వరి దేవి అనంతరం ఆలయ ప్రవేశం చేశారు.



జ్యోతులు ఎత్తుకున్న భక్తులు

ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండ కలకడ సీఐ గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

జవాబుదారి తనంతో పనిచేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్

కురబలకోట : రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పని తీరు మరింత మెరుగుపరచుకుని జవాబుదారితనంతో పనిచేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. మండలంలోని అంగళ్లు విశ్వం కళాశాలలో గురువారం డివిజన్ స్థాయిలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో జరిగిన సమావేశంలో పీజీఆర్ఎస్, రీ సర్వే, భూసేకరణ, కోర్టు కేసులు, పొజిసన్ సర్టిఫికెట్లు, అసైన్‌మెంట్ భూములు తదితర వాటిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి పనితీరును ప్రజలు గమనిస్తుంటారన్నారు. చట్ట ప్రకారం చేయతగిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. దురాక్రమణదారులపై తగు చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా మ్యుటేషన్స్, ల్యాండ్ గ్రాబింగ్, ఎంట్రీల దిద్దుబాటు, రీ సర్వే అభ్యర్థనలు, ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని పేర్కొన్నారు. కోర్టు కేసులలో ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ అంశాలలో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు బాధ్యతగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని హితవుపలికారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : స్వయం సహాయక సంఘాలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జోహార్‌బాషా అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో 2025–26వ సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ఈవోలు, ఎన్యుమరేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులు తమ కుటుంబ అవసరాల కొరకు కావాల్సిన రుణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 25 సంవత్సరాలుగా సంఘాల్లోని మహిళలు వివిధ బ్యాంకుల నుంచి బ్యాంకు లింకేజీ, మండల సమాఖ్య, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు పొందుతున్నట్లు తెలిపారు. ఈ



మాట్లాడుతున్న ఏపీఎం జోహార్‌బాషా

రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అవుతూ, సుస్థిర అభివృద్ధి పొందాలన్నారు. పొదుపులు, అప్పులు సమర్థవంతంగా వినియోగంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు, ఎన్యుమరేటర్లు, సీసీలు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు



ముస్తాబవుతున్న కల్యాణ సీతారామస్వామి ఆలయం

పీలేరు రూరల్ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని పీలేరు పట్టణంలోని స్థానిక ప్రకాశం రోడ్డులోని శ్రీ సీతారామలక్ష్మణ హనుమాన్ సమేత కోదండరామ స్వామి ఆలయం, సదుం రోడ్డులోని శ్రీ కల్యాణ సీతారామస్వామి వారి ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 6న సీతారాముల కల్యాణం వైభవంగా జరుగుతుందని తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో అన్నప్రసాదం, తీర్థప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు.

సహజ ప్రసవాలే శ్రేయస్కరం

బి.కొత్తకోట : సహజ ప్రసవాలు మహిళలకు ఎంతో శ్రేయస్కరమని స్థానిక సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం సీహెచ్‌సీలో గర్భిణులు, మహిళలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి కాన్పు సిజేరియన్ జరిగితే, రెండో కాన్పుగా తప్పనిసరిగా సిజేరియన్ చేయాల్సి ఉంటుందని అన్నారు. దీనివల్ల కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. బలమైన పౌష్టికాహారం, సరైన పద్ధతులు పాటించడం ద్వారా గర్భిణులకు సహజ ప్రసవాలు



మహిళలకు సూచనలిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

అయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో సహజ ప్రసవాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వైద్యులు ఆరీఫుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.72 లక్షల నిధులు దుర్వినియోగం

- 23 పనులు చేశారని చెబుతూ ఎంపీపీ ఆరోపణ
- కలెక్టర్, జెడ్పీ సీఈఓలకు నివేదించామన్న రిటైర్డ్ ఎంపీడీఓ శంకరయ్య

బి.కొత్తకోట : ఆరునెలల కాలంలో బి.కొత్తకోట మండల పరిషత్‌లో రూ.72 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎంపీపీ లక్ష్మీనరసమ్మ ఆరోపించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రిటైర్డ్ ఎంపీడీఓ శంకరయ్య హయాంలో తన అనుమతి లేకుండానే నిధులను ఖర్చు చేశారని, వీటికి లెక్కలు చెప్పాలని సమాచార హక్కు చట్టంకింద దరఖాస్తు చేసినట్టు చెప్పారు. తనపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై గత ఎంపీడీఓపై విచారణ జరపాలని కలెక్టర్‌కు లేఖ రాయడం జరిగిందని చెప్పారు. ఈ నిధులు దేనికి ఖర్చు చేశారో తెలియడం లేదని చెబుతూనే 23 పనులకు ఈ నిధులు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఈ విషయమై రిటైర్డ్ ఎంపీడీఓ శంకరయ్య మాట్లాడుతూ ఎంపీపీ ఆరోపణలపై పూర్తి స్థాయిలో వివరాలను కలెక్టర్, జెడ్పీ సీఈవోలకు నివేదించడం జరిగిందన్నారు. మండల పరిషత్ నిధుల నుంచి ఖర్చు చేసిన ప్రతిపైసాకు వివరాలు ఉన్నాయని, ఎంపీపీ ఆమోదం లేకుండా నిధులను ఖర్చు చేయడం జరగదని స్పష్టం చేశారు. ఒక బిల్లు మంజూరు కావాలంటే నిబంధనల ప్రకారం వెళ్లాల్సి ఉంటుందని, అలాంటిది నిధులు దుర్వినియోగానికి ఆస్కారం లేదన్నారు. తీర్మానాల ఆధారంగా నిధులను ఖర్చు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తీర్మానాలు, వాటిద్వారా చేసిన ఖర్చు వివరాల రికార్డులను కలెక్టర్, జెడ్పీ సీఈఓలకు నివేదించినట్టు చెప్పారు.

కనుల పండువగా ధ్వజావరోహణం

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టాభిరాములవారి శ్రీ విశంబినామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం శ్రీరాముడు సతీసమేతంగా గజవాహనంపై పట్టణ పురవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాతసేవ, ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, అలంకరణ, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8.15 గంటలకు మేషలగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వాహన మండపంలో స్వామివారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 8 గంటలకు గజవాహనంపై శ్రీ సీతారాములు వాల్మీకి క్షేత్రంలోని తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.



ధ్వజావరోహణం చేస్తున్న అర్చకులు

ముస్లిం సమాజంపై వివక్ష ఎందుకు?

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్

మదనపల్లె : శ్రీరాముడు నడిచిన దేశంలో ముస్లిం సమాజంపై ఎందుకు వివక్ష చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబును ప్రశ్నించారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు షమీం అస్లంతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లిం పర్సనల్ లా, వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో ముస్లిం ప్రాపర్టీస్‌పై ఎందుకు జోక్యం తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం సమాజానికి కష్టం వచ్చిన ప్రతిసారి అండగా నిలిచారన్నారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి పార్లమెంట్ వేదికగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ తరపున వ్యతిరేకించారని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ ముబీన, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రేవతి, ఫర్జానా రఫీ, ముబాసిర్ అహ్మద్, కరీముల్లా, నూర్ మొహిద్దిన్ ఖాన్, వైజయంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్

కార్పొరేట్లకు అప్పగించేందుకే వక్ఫ్ చట్టం

మసీదులకు, ముస్లిం ధార్మిక సంస్థలకు దానంగా సంక్రమించిన ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు తెచ్చిందని భారతీయ అంబేడ్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ విమర్శించారు. గురువారం స్థానిక కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. పాలక పక్షం ఈ బిల్లును సమర్థించుకోవడానికి అనేక అబద్దాలను ప్రచారం చేస్తోందని, వక్ఫ్ భూములను రక్షించడం, అన్యాక్రాంతం కాకుండా నివారించే లక్ష్యంతో ఈ చట్టం తెచ్చినట్టు చెబుతున్నారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని పలు మండల పార్టీ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

మదనపల్లె మండల పార్టీ కమిటీ

మదనపల్లె మండల పార్టీ కమిటీ ఉపాధ్యక్షులుగా టి. రామమూర్తి, సి. బయన్న, ప్రధాన కార్యదర్శులుగా ఎం. మహేష్‌బాబు, ఎస్. రమేష్ బాబు, మనోహర్ నాయుడు, పసుపులేటి రమేష్, కార్యదర్శులుగా సి. ఈశ్వరమ్మ, రెడ్డి శేఖర్, ఎంఎస్ హబీబ్, ఆర్. నవీన్, యు. మురళీ, సభ్యులుగా ఎస్ ఎండీ బాబ్‌జాన్, కేవీ సుబ్బారెడ్డి, ఎస్. ఆసిఫ్, జి. వెంకటేష్, పి. శ్రావణ్, హెచ్. రమేష్, వి. శ్రీనివాసులు, కె. వేణుగోపాల్, సి. హరి, పి. రమణ, షేక్ షమ, సాదిక్, ఎస్. నరానిరెడ్డి, నాగరాజ నాయక్, ఎం.మురళి, జయరాం, ఎల్.వెంకటరామ, భాస్కర్ రెడ్డి, రెడ్డెప్ప, పి.శంకర్ యాదవ్; చరణ్; చలపతినాయుడు, జి.నాగరాజ, ఎస్.జైనుల్లా సాహెబ్, కె.రెడ్డెప్పలను నియమించారు.

మదనపల్లె మున్సిపల్ పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా బాలగంగాధర్‌రెడ్డి, పీరావలీ రాజేష్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.సలీంబాష, ఎస్.నవాజ్ అలీ, పీవీ రమణ. ఆర్.వెంకట శివారెడ్డి, కార్యదర్శులుగా టి.పవన్‌తేజ, టీఎస్ నూరుల్లా, బీఆర్ భాను ప్రకాశ్, ఎం.సుధాకర్, జి.నాగమణి, సభ్యులుగా లక్ష్మిరెడ్డి, ఎస్.మస్తాన్‌వలీ, జి.రెడ్డిశేఖర్, అబ్రహం, మహమ్మద్ రఫీ, టి.మంజునాథ్, పి.గంగులప్ప, మహేష్, షరీఫ్, మల్లికార్జున, బాలసుబ్రమణ్యం, రమణమ్మ, అల్లాబకష్, కరీముల్లా, టి.హరికృష్ణారెడ్డి, కె.పూర్ణచంద్ర, బి.మునీశ్వర్‌రెడ్డి, వై.బాలకృష్ణ, ఎం.ఆదినారాయణ, పి.సహవేద, మహేందర్‌రెడ్డి, సి.గంగుల్‌రెడ్డి, కేశవరెడ్డి, మురాష, మస్తాన్, ఎస్ఎండీ అంజద్‌అలీ, అష్రఫ్, ఉమర్, సైఫుల్లా, మజహర్, ఎం.ఫైరోజ్‌ఖాన్; మధుసూదన్, రెడ్డిరాణి, నాగరాజరావు, పుష్పలను నియమించారు.

నిమ్మనపల్లె మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఎ.నాగరాజ, పి.రాజగోపాల్, ప్రధాన కార్యదర్శులుగా పి.శ్రీనివాసులు, జి.చరణ్; కె.రమణ, డి.ప్రసాద్‌బాబు, కార్యదర్శులుగా ఇ.నాగార్జున, ఆర్.రెడ్డిప్రసాద్, ఎ.నారాయణ, కె.రెడ్డిశివకృష్ణ, ఎస్.ఖాదర్‌బాష, సభ్యులుగా యు.రెడ్డిప్రసాద్, ఎం.నరసింహులు, పి.కదిరప్ప, వై.ఎర్రంనాయుడు, వై.నాగరాజ, ఇ.నాగరాజ. జి.గుర్రప్ప, కె.నరేష్, పి.వెంకటాద్రి, సి.వెంకట రమణలను నియమించారు.

రామసముద్రం మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఎస్.కృష్ణప్ప, కె.వల్లప్ప, ప్రధాన కార్యదర్శులుగా సీఆర్ ఈశ్వర్‌రెడ్డి, సి.బుద్దారెడ్డి, ఎం.విజయ, సీపీ రమ్మప్ప, కార్యదర్శులుగా బి.రమణారెడ్డి, వి.జబీబాష, టి.అంబరీష్, ఎ.మున్వర్ బాష, కె.నారాయణస్వామి, సభ్యులుగా ఎం.అమర్‌నాథరెడ్డి, ఎస్.గుణశేఖర్, టి.రమణ, సి.కేశవ, వై.నాగరాజ, ఐ.ప్రసాద్, వై.హరీష్, సీహెచ్ మంజునాథ్, బి.నవీన్‌కుమార్; ఎం.సోమశేఖర్‌రెడ్డి, టి.శ్రీనివాసులు, బీకే నరసింహులు, బి.నరేష్‌రెడ్డి, టి.గుణశేఖర్; జి.పురుషోత్తంరెడ్డి, కె.చంద్రశేఖర్‌రావు, ఇ.విజయారెడ్డిలను నియమించారు.

దైవానికి కృతజ్ఞత అఖీఖా



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నాయకులు

కురబలకోట : దైవానికి కృతజ్ఞత తెల్పడానికి వివిధ ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగుతున్నాయని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ముదివేడులో ఆయన మండల వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ నౌషాద్ సోదరుడు ముక్తియార్ కుటుంబంలో జరిగిన అఖీఖా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మనిషికి దేవుడు చేసిన మేలుకు కృతజ్ఞత చూపడం గొప్ప బహుమతి అన్నారు. వీటితో సామాజిక హితం, విలువలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. ఫిరోజ్‌ఖాన్, అంజాద్‌ఖాన్, షాకత్, ముబారక్, షంషేర్, కన్వీనర్ చౌడేశ్వర, కిశోర్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



చంద్రశేఖరం మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె : అనారోగ్యంతో బెంగుళూరులో చికిత్స పొందుతూ బుధవారం మదనపల్లె సాక్షి ఆర్‌సి ఇన్‌చార్జ్ సురమాల వంశీధర్ తండ్రి రిటైర్డ్ తెలుగు పండితులు సురమాల చంద్రశేఖరం మృతి చెందారు. గురువారం మదనపల్లె వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ పుంగనూరు వెళ్లి చంద్రశేఖరం పార్థివదేహానికి నివాళులు అర్పించారు. వంశీధర్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. తాము అండగా ఉంటామంటూ ఓదార్చారు. మదనపల్లె పట్టణంలోని ప్రముఖులు, మీడియా మిత్రులు పెద్ద ఎత్తున హాజరై చంద్రశేఖరం భౌతికకాయానికి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు చరణ్, మహేష్, జబీ, అబ్దుల్లా, సాదిక్ ఉన్నారు.

ఆర్థిక ప్రణాళికపై శిక్షణ

తంబళ్లపల్లె : స్థానిక స్త్రీశక్తిభవన్‌లో స్వయం సహాయక సంఘ సభ్యురాలి ఆర్థిక ప్రణాళికపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏపీఎం గంగాధర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు, వీఓఏలు, సీసీలు ఆర్థిక ప్రణాళిక సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి సంఘంలో సభ్యురాలి పొదుపు, సామాజిక స్థితి, కుటుంబ ఆదాయం, అప్పుల వివరాలు, సభ్యురాలి అవసరాలు, అంశాలను సర్వేలో గుర్తించాలన్నారు. సభ్యురాలు తీసుకునే అప్పు అవసరాలను జీవనోపాధుల కొరకు తదితర అంశాలను పొందుపరచాలన్నారు.

అనుమతి లేని భవనాలపై చర్యలు

కురబలకోట : మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాలపై తగు చర్యలు తప్పవని గ్రామ కార్యదర్శి టి.ఉదయ కుమార్ హెచ్చరించారు. అనుమతి లేని భవనాలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించబడవన్నారు. అంతేకాదు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె : ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల కోసం , వారిలో మార్పుకోసం ఏర్పాటు చేసిన భవిత విద్యా వనరుల కేంద్రం సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగపర్చుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఉమర్‌ఫారూక్ కోరారు. భవిత కేంద్రంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లల పరిస్థితులు, మౌళిక వసతులు, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. భవిత కేంద్రం సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజు, ఐఈ టీచర్లు రేఖ, శ్రావణి, సరళ, సీఆర్‌పీ సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమర్‌ఫారూక్